క్లుప్తంగా

గోవు మృతికి కారకులపై చర్యలకు వినతి



మనుబోలు: పంచాయతీ అధికారులకు తెలియకుండా విద్యుత్ మోటార్‌కు మరమ్మతులు చేసే క్రమంలో తప్పు కనెక్షన్ ఇచ్చి ఓ ఆవు మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని పంచాయతీ సిబ్బంది కోరుతున్నారు. మండలంలోని కొండాయపాళెంలో మోటార్ పాడవడంతో కుళాయి నీరు రావడంలేదంటూ కొందరు స్థానికులు శుక్రవారం మరమ్మతులు చేశారు. ఈ క్రమంలో మోటార్‌కు సంబంధించిన పైపులో విద్యుత్ సరఫరా కావడంతో అటుగా వెళ్తున్న గోవుకు తగిలి మృతి చెందింది. విషయం తెలుసుకున్న పంచాయతీ సిబ్బంది మోటార్‌ను సరిచేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరారు.

సంతపేట ఇన్‌స్పెక్టర్‌గా వైవీ సోమయ్య



బాధ్యతలు స్వీకరిస్తున్న సోమయ్య

నెల్లూరు(క్రైమ్): నగరంలోని సంతపేట ఇన్‌స్పెక్టర్‌గా వైవీ సోమయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, నగర డీఎస్పీ పి.సింధుప్రియను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైవీ సోమయ్య మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక శక్తులు, నేరస్తులపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. కాగా సోమయ్య గతంలో జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో సీఐగా పనిచేశారు.

ఆరోగ్యశ్రీ సేవలను తక్షణమే పునరుద్ధరించాలి

నెల్లూరు(బీవీఎస్‌సెంటర్): ఆరోగ్యశ్రీ సేవలను తక్షణమే పునరుద్ధరించాలని, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు ప్రభుత్వం వెంటనే ఆరోగ్యశ్రీ బకాయిలను చెల్లించి పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, కార్యదర్శి సభ్యుడు నాగేశ్వరరావు, నగర కమిటీ సభ్యుడు మూలం ప్రసాద్ డిమాండ్ చేశారు. నగరంలోని 54వ డివిజన్ జనార్దనరెడ్డి కాలనీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్దనరెడ్డి కాలనీ సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించి అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద నిరసన చేపట్టారు. అనంతరం వీరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు చెల్లించాల్సిన రూ.వేల కోట్ల బకాయిలను నిలిపివేయడంతో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచి పోయాయని, దీంతో ప్రజలకు ఉచిత వైద్యం అందక ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివిధంగా అర్బన్‌హెల్త్ సెంటర్లలో కనీస వసతులేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని, నామమాత్రపు వైద్య సేవలతో ప్రభుత్వ పనితీరు ఏంటో తెలుస్తోందన్నారు. వెంటనే ఆరోగ్యశ్రీ బకాయిలు విడుదల చేయాలని, లేని పక్షంలో కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ప్రైవేటీకరణపై ప్రజాగ్రహం

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన 17 మెడికల్ కళాశాలలను చంద్రబాబు ప్రైవేటు వారికి అప్పగిస్తూ తీసుకున్న నిర్ణయంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని వారు తెలిపారు. నిరంతరం పీ-4 జపం చేస్తున్న చంద్రబాబు తన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ రంగంలో వైద్య సౌకర్యాలు మెరుగుపరిచి, వైద్య కళాశాలలను ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సూర్యనారాయణ, నరసింహా, పద్మ, గద్దం శ్రీనివాసులురెడ్డి, మద్దిపాటి శ్రీనివాసులురెడ్డి, మంజుల, భార్గవి, మహేంద్ర, వెంకటేశ్వర్లు, సుబ్బయ్య పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో వైట్‌కోట్ వేడుక



హాజరైన ప్రథమ సంవత్సర వైద్య విద్యార్థులు

నెల్లూరు (టౌన్): స్థానిక ఏసీ సుబ్బారెడ్డి వైద్య కళాశాలలో నూతనంగా చేరిన ప్రథమ సంవత్సర విద్యార్థులకు వైట్‌కోట్ వేడుక, యాంటీ ర్యాగింగ్, యాంటీ నార్కోటిక్స్‌పై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి వైద్య వృత్తి విశిష్టత, నేర్చుకోవాల్సిన మెళకువలు గురించి తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు వైట్‌కోట్‌లను అందజేశారు. ర్యాగింగ్‌కు పాల్పడితే ఎలాంటి శిక్షలు ఉంటాయో సీఐలు రోశయ్య, జగన్‌మోహనరావు, టీవీ సుబ్బారావులు వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గోపి, మహేష్, రూప్స్ ఎన్జీఓ అధ్యక్షుడు రసూల్, సూపరింటెండెంట్ మాధవి, వైస్ ప్రిన్సిపల్ విక్టర్, మస్తాన్‌షా, వార్డెన్లు శ్రీకాంత్, ప్రశాంత్, వైద్యులు కీర్తి తేజ, పుల్లయ్య పాల్గొన్నారు.

రైతుల పరిస్థితి దయనీయం

- కూటమి ప్రభుత్వంలో ఇబ్బందులు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నేతలతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, పండించిన పంటను గిట్టుబాటు ధరకు విక్రయించే పరిస్థితి లేదని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బీ చెర్లోపల్లి, మనుబోలు మండలం లక్ష్మీనరసింహపురం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తనను కలిసిన రైతులతో ఆయన మాట్లాడారు. కొండామంటే కొరిది, అమ్ముదామంటే అడవి అనే చందంగా రాష్ట్రంలోని రైతుల పరిస్థితి మారిందని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా అతి తక్కువ ధరలకు కొని మిల్లర్లు, వ్యాపారులు.. అధిక రేట్లకు విక్రయించి లాభపడుతున్నారని ఆరోపించారు. సోమిరెడ్డి ఎప్పుడు అధికారంలో ఉన్నా మిల్లర్లతో కలిసి రైతుల నోట్ల కొట్టడం ఆనవాయితీగా మారిందని చెప్పారు. సర్వేపల్లిలో అవినీతి తప్ప అభివృద్ధి లేదని.. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు తమ పార్టీ హయాంలోనే జరిగాయని చెప్పారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని సోమిరెడ్డి కుమారుడు ఇష్టారాజ్యంగా గ్రావెల్, మట్టి, ఇసుక, బూడిద దందాలను సాగిస్తున్నారని ఆరోపించారు. పనులు చేయకుండానే జలవనరుల శాఖలో దొంగ బిల్లులు చేయించుకున్నారని.. విచారణ జరిపితే అన్ని విషయాలు బయటపడతాయని.. సంబంధిత అధికారులు జైలుకెళ్లడం ఖాయమన్నారు. పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా తమ పార్టీ ఘన విజయం సాధించడం తథ్యమని చెప్పారు. అనంతరం పలు వివాహ వేడుకలకు ఆయన హాజరయ్యారు. చెర్లోపల్లికు చెందిన సీనియర్ నేత బత్తల పెంచలరెడ్డిని పరామర్శించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



తోటపల్లిగూడూరు: చిన్నచెరుకూరులోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ప్రత్యేక వైద్య శిబిరాలను కోడూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శనివారం నిర్వహించారు. అనంతరం మందులను అందజేశారు. సీజనల్ వ్యాధుల బారినపడకుండా పాటించాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. వసతిగృహ సంక్షేమాధికారి నాగలక్ష్మి, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశ వర్కర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన



ముత్తుకూరు(పొదలకూరు): జనంలోకి.. మనం అనే అంశంపై ర్యాలీని పట్టణంలో పోస్టల్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది శనివారం నిర్వహించారు. పోస్టల్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నెల్లూరు తూర్పు సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు మాట్లాడారు. పోస్టల్ శాఖ ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముత్తుకూరు సబ్ పోస్ట్‌మాస్టర్ అవుల నాగేశ్వరరావు, మన్సూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



కోవూరు: మండలంలోని నాయీ బ్రాహ్మణ వీధికి చెందిన పాటూరు రమేష్– సుజన దంపతుల కుమారుడు విష్ణుతేజ వివాహం భవ్యశ్రీతో రైల్వేఫీడర్స్ రోడ్డులోని గుర్రం రామయ్యశెట్టి కల్యాణ మండపంలో శనివారం జరిగింది. ఈ క్రమంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అనూప్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు హరిప్రసాద్ రెడ్డి, బాలశంకర్‌రెడ్డి, మోహన్, రమేష్, శేఖర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

బైకులు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు



మనుబోలు: లారీని అధిగమించే క్రమంలో రెండు బైకులు ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. నెల్లూరులోని రంగనాయకులపేటకు చెందిన భాదర్‌బాషా పనినిమిత్తం గూడూరుకు బైక్‌పై వెళ్లి తిరుగుపయనమయ్యారు. ఈ క్రమంలో కొండూరుసత్రం వద్ద హైవేపై ముందు వెళ్తున్న లారీని అధిగమించే క్రమంలో ఎదురుగా వస్తున్న మరో బైకును ఢీకొన్నారు. దీంతో క్షతగాత్రుడ్ని 108లో నెల్లూరు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉన్నత విద్యనభ్యసించేలా ప్రోత్సహించాలి



వెంకటాచలం: మాట్లాడుతున్న విజయలక్ష్మి



తోటపల్లిగూడూరులో..

వెంకటాచలం: బాలికలు ఉన్నత విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి సూచించారు. మండలంలోని గొలగమూడి వద్ద గల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన బాలికల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది తల్లిదండ్రులు తమ కుమార్తెల చదువులను మధ్యలో మాన్పించి ఇంటికే పరిమితం చేస్తున్నారని, ఉన్నత విద్యనభ్యసించే ప్రయోజనాలను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. అనంతరం బాల్య వివాహాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీతాలక్ష్మి, పద్మజ, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీమహేశ్వరీదేవి తదితరులు పాల్గొన్నారు.

- తోటపల్లిగూడూరు: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలని ఐసీడీఎస్ పేడూరు సెక్టార్ సూపర్‌వైజర్ లలితాంబ సూచించారు. మండలంలోని మాచర్లవారిపాళెం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ బాలికల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. ఆరోగ్య విషయంలో కిశోర బాలికలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అంగన్వాడీ కార్యకర్తలు శ్యామల, సుమ, మాధవి తదితరులు పాల్గొన్నారు.
- ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని కప్పలదొరువు అంగన్వాడీ కేంద్ర పరిధిలో అంతర్జాతీయ బాలిక దినోత్సవ ర్యాలీని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సూపర్‌వైజర్ అరుణమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు శ్రీలత, శైలజ, సుప్రజ, పాపమ్మ, జ్ఞానప్రసూన తదితరులు పాల్గొన్నారు.
- కోవూరు: స్థానిక సంక్షేమ వసతి గృహంలో బాలికా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికా విద్య, ఆరోగ్యం, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు పి.విజయ్‌కుమార్, వెంకటయ్యనాయుడు, పి.విజయమ్మ, బుజ్జయ్య, భాస్కర్‌రావు, బత్తల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు శ్రీశైలం, రంతుల్లా, బి.వెంకయ్య, జయప్రకాశ్, భాజాపతి తదితరులు పాల్గొన్నారు.



ముత్తుకూరులో..



కోవూరు సంక్షేమ వసతి గృహంలో..

భక్తుల సేవే లక్ష్యం

ఇందుకూరుపేట: గంగపట్నంలోని రామలింగేశ్వర అమ్మవారి భక్తుల సేవే లక్ష్యంగా పాలకమండలి పనిచేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఆలయ ఆవరణలో పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో చైర్మన్‌గా జి.కృష్ణారెడ్డి, సభ్యులు శనివారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని, సభ్యులను సన్మానించారు. అనంతరం పలు సూచనలు చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కోవూరు: ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బచ్చు డేవిడ్ చిన్నబాబు తెలిపారు. కోవూరులో ఆయన శనివారం మాట్లాడుతూ రోజురోజుకూ ఖర్చులు పెరుగుతున్నా, జీతాలు స్థిరంగా ఉండటంతో ఉపాధ్యాయులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పీఆర్సీ కమిషన్ నియామకం, 30 శాతం ఐఆర్ అమలు, 11వ పీఆర్సీ బకాయిల చెల్లింపు, తదితరాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. వెంటనే వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ లేక అగచాట్లు

- ట్రాన్స్‌ఫార్మర్లపై పిడుగులు

పొదలకూరు: పట్టణంలోని సబ్‌స్టేషన్లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యం, అర్ధరాత్రి పిడుగుల వర్షం వెరసి పొదలకూరు మున్సిపాలిటీ విద్యుత్‌కు శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పట్టణ వాసులతో పాటు చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల వారు మండిపడ్డారు. ఇతర పనులు నిలిచిపోయి ఇబ్బందులు పడ్డారు. సబ్‌స్టేషన్లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ విఫలమవడంతో మరమ్మతులు అధికారులు చేయించారు. అయితే సమస్య పెద్దది కావడంతో సమయం పట్టిందని వెల్లడించారు. దీనికితోడు పొదలకూరు మున్సిపాలిటీ పరిధిలో పలు సంఖ్యలో పిడుగులు శుక్రవారం రాత్రి పడ్డాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తారు. కాకుండా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో విద్యుత్ సమస్యలు తలెత్తాయి.

పిడుగుల వర్షం

పట్టణంలోని పద్మావతినగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగు పడింది. దీని ప్రభావానికి పక్కనే ఉన్న వికాస స్కూల్లో కంప్యూటర్లు, ఇతర విద్యుత్ వస్తువులు కాలిపోయాయి. చుట్టుపక్కల ఇళ్లలోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తదాన్ని బిగించారు.

అప్రెంటీస్‌షిప్ మేళా రేపు

నెల్లూరు (టౌన్): స్థానిక వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటీస్‌షిప్ మేళాను నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్ కె.శ్రీధర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కోర్టెల్, హామిల్టన్ శ్రీసిటీ, బ్లూస్టార్ శ్రీసిటీ, అశోక్ లైలాండ్, జేబీఎం గోల్డీలీఫ్, టాటా మోటార్స్, భారతి ఆటో మొబైల్స్, భారత్ బెంజ్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు తగిన ధ్రువ పత్రాలతో అప్రెంటీస్‌షిప్ మేళాకు హాజరు కావాలన్నారు.

అమ్మణ్ణి సేవలో శ్రీసిటీ ఎండీ

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని, ప్రాంగణంలో కొలువై ఉన్న మీనాక్షిసుందరేశ్వరస్వామిని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవి సన్నారెడ్డి శనివారం దర్శించుకున్నారు. స్వామివార్లు, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనల తదితర పూజలు నిర్వహించారు. వేదాశీర్వచనాలతో రవి సన్నారెడ్డిని సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. తొలుత ఆలయ మర్యాదలతో ఆయన్ను ఆహ్వానించారు. కార్యక్రమంలో ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఉప ప్రధానార్చకుడు కుప్పచ్చి రవికిరణ్, అర్చకులు, వేదపారాయణదారుడు తదితరులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన గిరిజనుల గుడిసెలు

- కట్టుబట్టలతో రోడ్డునపడిన నాలుగు కుటుంబాలు



కొడవలూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నాలుగు గిరిజన కుటుంబాల గుడిసెలు పూర్తిగా దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబాలు కట్టుబట్టలతో రోడ్డున పడ్డాయి. ఈ ఘటన మండలంలోని నార్తురాజుపాళెం వినాయక నగర్ గిరిజన కాలనీలో శనివారం చోటుచేసుకొంది. ఇక్కడి రైల్వే ట్రాక్ పక్కన సుమారు 20 కుటుంబాల గిరిజనులు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. వీటిలోని ఒక ఇంట్లో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మంటలు వ్యాపించి పక్కనే ఉన్న మరో మూడు గుడిసెలకు వ్యాపించి పూర్తిగా దగ్ధమయ్యాయి. ఆ నాలుగు ఇళ్లలోని వంట సామగ్రితో పాటు దుస్తులు తదితరాలన్నీ పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఆ నాలుగు కుటుంబాల గిరిజనులు కట్టుబట్టలతో మిగిలారు.

ఆర్థిక సాయం అందజేత

మండలంలోని నార్తురాజుపాళెం వినాయక నగర్ గిరిజన కాలనీలో అగ్ని ప్రమాదానికి గురై సర్వం కోల్పోయిన గిరిజనులను స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శనివారం రాత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె నాలుగు బాధిత కుటుంబాలకు రూ.25 వేల చొప్పున నగదు, వంట సామగ్రిని పంపిణీ చేశారు. తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి, ఎంపీడీఓ ఏపీ సుబ్బారావు, స్థానిక నాయకులు పాటూరి రమేష్, జి.రాజేంద్ర, టి.ప్రవీణ్‌కుమార్, బి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రసన్న పరామర్శ



కోవూరు: మండలంలోని ఇనమడుగు గ్రామంలో అవుల సుధాకర్, శైలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, వారి కుటుంబసభ్యులను మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పార్టీ నాయకులు గంధవరపు వసంతకుమార్‌రెడ్డి, ఎరటపల్లి మీరారెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు శివుని నరసింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కవరగిరి శ్రీలత, జిల్లా ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ నీలపరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి, మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, సర్పంచ్ ప్రమీలమ్మ, స్థానిక నాయకులు పాస్పర్తవలు సుధీర్‌రెడ్డి, గూడూరు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



ఇందుకూరుపేట: ఇందుకూరుపేట దళితవాడలో సుహాసిని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లను పంపిణీ చేశారు. స్థానికురాలు దాసరి సుహాసిని మూడో వర్ధంతి సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు తొలుత స్థానిక పీహెచ్‌సీ రోగులకు పండ్లను పంపిణీ చేయడంతో పాటు దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏకొల్లు పవన్‌రెడ్డి, గుడి హరికుమార్‌రెడ్డి, లేబూరు ఎంపీటీసీ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

వేడుకగా పల్లకిసేవ

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో విశేష పూజలను శనివారం నిర్వహించారు. పల్లకీసేవను సాయంత్రం జరిపారు. అభిషేకాలు, పూజలు నిర్వహించి.. భక్తులకు ప్రసాదాలను అందజేశారు.



నేత్ర వ్యాధులపై అవగాహన ర్యాలీ



వెంకటాచలం: ప్రపంచ అంధత్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేత్ర వ్యాధులపై అవగాహన ర్యాలీని వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ర్యాలీని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి సతీమణి ఉషమ్మ ప్రారంభించారు. నేత్ర వ్యాధులపై డాక్టర్లు అవగాహన కల్పించారు.

నిబంధనలకు విరుద్ధంగా..

- ఎక్స్ అఫీషియోగా ఇద్దరి ప్రమాణస్వీకారం



ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఇమ్మిడిశెట్టి సౌజన్యలక్ష్మి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని కొండావాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. 11 మంది పాలకమండలి సభ్యులతో ఈఓ వెంకటశ్రీనివాసులురెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. వీరిలో మాచర్ల అశోక్‌రెడ్డిని ఆలయ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఆలయ అర్చకుడు శివరంగా ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఇమ్మిడిశెట్టి సౌజన్యలక్ష్మి అనే టీడీపీ మహిళా నేత తనను నియమించినట్లు ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకోవడంతో పాటు అందరి సభ్యులతో కలిసి ఆమె కూడా ప్రమాణస్వీకారం చేశారు.

దీనిపై ఈఓ శ్రీనివాసులురెడ్డిని వివరణ కోరగా ఈ విషయం తనకు తెలియదని, తమకు అందిన ఆదేశాల్లో ఉన్న సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించామని చెప్పారు. ఆలయ సిబ్బంది, అధికార పార్టీ నాయకులు ఎవరూ చెప్పకుండానే సదరు వ్యక్తి ముందస్తుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించడం, వరిలోపలికి ప్రమాణ స్వీకారం చేయించడం జరుగుతుందా..! అంటూ పలువురు భక్తులు, స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆలయ భూములు ఆక్రమించి లేఅవుట్లుగా మార్చడం తదితర పనులతో ఆలయ ప్రతిష్ఠకు భంగం కలుగుతుంది.. తాజాగా జరిగిన ఘటన ఆలయాధికారుల నిర్లక్ష్యం, అధికార పార్టీ లెక్కలేని తనం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

దొంగకు దేహశుద్ధి

మనుబోలు: దొంగను స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన మండలంలోని కొండూరుసత్రంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. మనుబోలులోని ఓ దుకాణంలో యజమాని కళ్లుగప్పి కొన్ని వస్తువులను ఓ గుర్తు తెలియని వ్యక్తి రెండు రోజుల క్రితం చోరీ చేశారు. వీటిని విక్రయించేందుకు గానూ కొండూరుసత్రంలోని జాతీయ రహదారి పక్కనున్న ఓ హోటల్ వద్ద బేరమాడుతూ అనుమానాస్పదంగా కనిపించారు. మనుబోలులో చోరీ విషయాన్ని సీసీటీవీ ఫుటేజీలో స్థానికులు చూసి ఉండటంతో పట్టుకునేందుకు యత్నించారు. కత్తితో బెదిరిస్తూ తిరగబడగా, మరింత మంది పోగై అతడ్ని పట్టుకుని దేహశుద్ధి చేసి కాళ్లు, చేతులు కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శివరాకేష్ అక్కడికి చేరుకొని నిందితుడ్ని అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు.